

'సారసాక్షు'

*ఇదమిత్థమని కామ్యాన్ని తెలుసుకొనడం కష్టం. ఈలాంటి అదృష్టం అందరికీ లభించదు. తొలుత శక్తికొలది దూరంగా త్రోసివేసినది ఒక్కటే కోరదగినది, కోరేది అయితే ఆ కోరికకు ఉండే బలం మరి దేనికీ ఉండదు. తీరా ఈ స్థితి వచ్చేసరికి అది కాస్తా చేయిజారితే ?*

---

"ఆ అమ్మాయి పేరు మాలతిరా."

"ఏం అయితే?" అన్నాడు ప్రసాదరావు సహజ అమాయిక ధోరణిలో.

"మాలతిరా ఆ అమ్మాయి పేరు" అన్నాడు జయరాం విసుగ్గా.

"ఇద్దరు అమ్మాయి లున్నారంటావా?"

జయరాం పావుగంటసేపు పళ్లు కొరికి చివరికి "ఆ అమ్మాయి అంటే కాలేజీ మొత్తానికి

హడలు. వాళ్ల నాన్న దుర్వాసుడు. ఆమెను ప్రేమించటం మహా ప్రమాదకరం" అన్నాడు.

"ప్రేమా?" అన్నాడు ప్రసాదరావు విస్మయంతో.

జయరాం లేచి నిలబడి "గుడ్‌బై"! అని విసురుగా బయటకు వెళ్లిపోయాడు.

ప్రసాదరావు నవ్వుకున్నాడు.

• • •

ప్రసాదరావు టూకీగా ఎర్రగా ఉంటాడు-

# నాగదంష్ట్రి

మానసికంగా, దైహికంగా కూడా. అతని ఇరవై రెండేళ్ల జీవితంలో అతను సాధించదలుచుకున్నవి రెండు. ఒకటి పోస్టు గ్రాడ్యుయేట్ కావటం. రెండోది మంచి ఉద్యోగం సంపాదించడం. అందులో మొదటి కోరిక నెరవేరింది— నాలుగువేల అప్పుతో. అతను ఎమ్మెస్సీ పాసయాడు. ఇహ రెండో కోరిక మిగిలింది. దాని కోసం అన్వేషణ ప్రారంభించాడు.

ప్రసాదరావు చదువుకుంటున్నప్పుడు, ఆ తరువాత కూడా పెద్ద పేరేమీ సంపాదించుకోలేదు. కాలేజి రిజిష్టర్‌లో తప్ప అతనిపేరు ఇతరత్రా ఎక్కడా పడలేదు. అతను ఆశించనూ లేదు. సహజంగా మితభాషి అయిన ప్రసాదరావు ఎవరితోనూ కలిసి ఉండేవాడు కాదు. అయితే అలా కలిసి ఉండకపోవటానికి మరో కారణం కూడా ఉంది. కాలేజీలో నలుగురు విద్యార్థులతో దోస్తీగా ఉండాలంటే జేబులో పైసా పుష్కలంగా ఉండాలి. అది అతని దగ్గర సున్న. అతని 'జాతి'కి చెందిన నలుగు రయిదుగురు మాత్రం అతనితో కాస్త స్నేహంగా ఉండేవారు.

పోస్టు గ్రాడ్యుయేట్ అయి లాటరీ కొడుతూన్న మొదటి రోజుల్లో అత నొక సంఘటన అనుభవించాడు. అది ఒక రకంగా అతనికి లాభదాయకమైంది. అతనికి కొద్దిగా తెలిసిన మిత్రు డొకడు పత్రికలో కథలు వ్రాస్తున్నాడు. అతనికి తరచు పత్రికాధిపతుల దగ్గర్నుంచి పాతికో ఇరవయ్యో పారితోషికాలు లభిస్తున్నాయి. అది చూడగానే అతనికి తానూ కథలు ఎందుకు రాయకూడదూ అన్న ఆలోచన కలిగింది. ఆ రచయితనే అడిగాడు—ఎలా రాయాలో చెప్పమని. ఆయనగారూ కొత్తగా రాస్తున్న వాడు. గర్వంగా భుజా లెగురవేసి "ఇన్స్పిరేషన్" అనేసి వెళ్లిపోయాడు. ప్రసాదరావు మనస్సు చివుక్కుమంది.

అయితే అతనిలో కలిగిన ఆలోచన మాత్రం అణగారిపోలేదు. తాను చదువుకున్న తెలుగు పుస్తకాలన్నీ మళ్లీ చదివాడు. రాత్రింబవళ్ళు ఆలోచించాడు. చివరికి ఒక కథకు అయిడియా తట్టింది. అర్ధరాత్రిదాకా కూచుని రాసేశాడు.

మర్నాడులేచి ఆ కథ చూసేసరికి దాన్నిండా బండబూతులు కనపడ్డాయి. పాతికపేజీలూ బర్రున చించేశాడు. మళ్లీ రాశాడు. తిరిగి చదవకుండా పోస్టుచేసి ఫలితంకోసం ఎదురు చూడసాగాడు.

ప్రసాదరావు ఉంటూన్న వీధిలోనే నాలుగు ఇళ్లు అవతలగా వాళ్ల దూరపు చుట్టం శర్మగారు ఉంటున్నాడు. ఆయనకు ప్రసాదరావుమీద, అతని కుటుంబంమీద సానుభూతి లేదు. ఆయన కూతురు రంగనాయకికి ప్రసాదరావంటే కావలసినంత తేలిక భావం. అతనొక పెద్ద 'స్నాబ్' అని ఆమె ఉద్దేశ్యం. అయినా ఆ రెండిళ్లకూ రాకపోక లుండేవి. ముఖ్యంగా ప్రసాదరావు తండ్రి చనిపోయిన తరువాత ఆ రాకపోకలు ఎక్కువయ్యాయి.

రంగనాయకి — టూకీగా చెప్పాలంటే— అందమైనది; తెలివయినది; నిండు కుండ వంటిది. మిన్ను విరిగి మీద పడినా చెదరని ధైర్యం కలది. పట్టుదల, సాధన తెలిసినది.

అందుకే ప్రసాదరావుకు ఆమె అంటే ఎంతో గౌరవం. ఎవరయినా ఆమె ప్రసక్తి తెచ్చి ఆమెనుగురించి పరుషంగా మాట్లాడితే సహించలేక పోట్లాడేవాడు. ఆ సంగతి రంగనాయకికి తెలీదు.

నెల రోజులు గడిచాయి. హఠాత్తుగా ఒక రోజున పత్రికాధిపతుల దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది—'కథ స్వీకరించబడినదనీ, వీలువెంట ప్రచురిస్తా'మనీ. ప్రసాదరావుకు ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. ఇంట్లో తల్లికీ, చెల్లెళ్లకూ చూపించాడు.

ఆ శుభ ఘడియనే మరొక తమాషా కూడా జరిగింది. ప్రసాదరావు దూరపు చుట్టం ఒకాయన తన కొడుక్కు కాలేజీలో సీటు-కావల్సి వాళ్లింటికి వచ్చి తిష్ఠవేశాడు. అప్పటికే కాలేజికి కావలసిన విద్యార్థుల్ని తీసుకోవటం అయిపోయింది.

ఆయన ప్రసాదరావుమీద వేశాడు భారం.

ప్రసాదరావుకు నవ్వొచ్చింది. ఏమిటి ఆయన భావం? కాలేజీ సీట్లు తన చేతిలో ఉన్నాయా? అయినా ఆ మాట చెప్పి నోరు మూసుక్కూచో బుద్ధికాలే దతనికి. పత్రికలో కథ పడుతూందని తెలిసిన క్షణంనుంచి అతనిలో ఒక రకమయిన 'అహం' తలెత్తింది. తాను చదువులోనేకాదు మరి కొన్ని విషయాల్లో కూడా అనువనిపించుకోగలడు. బొత్తిగా వాజకాదు. అదీగాక తన కథ విషయం కాలేజీలో లెక్చరర్లు కొందరికి చెప్పాలని


## సినిమానటులు

మీరు సినీకారులుగాచేరి, నెలకు మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

**BOMBAY FILM SERVICE**
**(W.A.P.) Phagwara (N.R.)**



## నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడనవసరంలేదు. ఈవ్యాధి నిర్మూలనకుగాను 30 సం.ల పరిశోధనా ఫలితముగా లభ్యపరచుకొనబడి పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదవుషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే భాధ నివారింపజేయుటయే గాక కొంత కాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 ఔ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకము

**ఇండియన్ మెడిసన్‌హౌస్,**

విజయవాడ—2.



## సోవియట్ భూమి

**చందా ఇప్పుడుచెల్లించి బహుమతులు పొందండి!**

ఇంగ్లీషు, తెలుగు, కన్నడం, ఒరియా, హిందీ, తమిళం, మహారాష్ట్రం, బెంగాలి, ఉర్దూ, మళయాళం, గుజరాతి, అస్సామీస్, పంజాబి, నేపాలి భాషలలో ప్రచురింపబడును.

**తగ్గింపు రేట్లు:**

**( 1961 నవంబరు 1 నుంచి డిశంబరు 31 వరకు )**

| | 1. సం. | 2 సం. | 3 సం. |
|---|---|---|---|
| ఇండియన్ & నేపాలిభాషలు | రు. 4/— | రు. 7/— | రు. 10/— |
| ఇంగ్లీషు— | రు. 5/— | రు. 9/— | రు. 13/— |

**బహుమతులు:**

చందాదారులకు 7 పేజీల క్యాలెండరు, రోదసీ గురించి సోవియట్ అన్వేషణ అనే పుస్తకము (1962 లో ప్రకటింపబడును) బహూకరింపబడును. కోరినవారికి రష్యన్ భాషలో పాఠములు కూడ పంపబడును.

మీ చందాలను మా స్థానిక ఏజంట్లువద్ద చెల్లించండి. లేదా మాకు పంపండి.

**INFORMATION DEPARTMENT**
**Embassy of the U.S.S.R. in India,**
**25, Barakhamba Road, New Delhi-1.**

ఉబలాటంగా ఉం దతనికి.

అతను కాలేజీకి వెళ్ళాడు.

కెమిస్ట్రీ లెక్చరర్ రామారావు అతని మీద అందరికన్నా కాస్త ఎక్కువ అభిమానం ఉన్నవాడు. ఆయన్నే పోయి కలుసుకుని మాటల మధ్యలో తన రచన విషయం బయటపెట్టాడు. ఆయన చేటంత మొహం చేసుకొని, "కంగ్రాచ్యులేషన్స్. మంచి మంచి కథలు వ్రాసి అభివృద్ధిలోకి రావాలని ఆశీర్వదిస్తున్నాను" అన్నాడు మనస్ఫూర్తిగా.

"మీ ఆశీస్సులుంటే" అన్నాడు ప్రసాదరావు వినయంగా.

"తప్పకుండా."

ఆ తరువాత పిచ్చాపాటీ అయినాక అసలు సంగతి వెల్లడి చేశాడు ప్రసాదరావు. ఆయన నవ్వి "అనుకున్నాన్లే" అని, సాలోచనగా "ఒక అమ్మాయి గ్రూపు మార్చుకుంటానంది. ఆ అమ్మాయి ఆ పనిచేస్తే మీ వాడికి సీటు దొరుకుతుంది" అన్నాడు.

"కబురు చేస్తారా?"

"దానికేం?" అని ఆయన ప్యూన్‌ను పంపించాడు అమ్మాయిని పిల్చుకు రమ్మని. పది నిమిషాలకు ఆ అమ్మాయి, రంగనాయకి వచ్చారు.

"ఏ మమ్మా మాలతీ? గ్రూపు మార్చుకోవటం ఖాయమేనా?" అన్నాడు రామారావు గారు.

ఆయన ప్రశ్న ప్రసాదరావుకు వినిపించలేదనడం అతిశయోక్తి కాదు. ఆడపిల్లలంటే ఆమడదూరం ఉండే అతగాడు ఆమెనుంచి దృష్టి మరల్చుకోలేకపోయాడు. సువర్ణ శలాక వంటి ఆమె సౌందర్యం జగన్మోహనంగా అవుపడింది. అయిదు నిమిషాలకు రామారావుగారు భుజం మీద చేయివేసి కుదపటంతో ఈ లోకంలోకి వచ్చాడు.

"రేపు మీ చుట్టాన్ని తీసుకురావయ్యా. చేర్పిద్దాం" అన్నా డాయన.


"అలాగే."

"ఇహ నువ్వెళ్ళమ్మా."

మాలతి, రంగనాయకి నమస్కారంచేసి వెళ్ళిపోయారు.

పావుగంట తరువాత బయటికి వచ్చిన ప్రసాదరావు సైకిల్ షెడ్ దగ్గరకు వచ్చి అక్కడ్నుంచి కదల్లేకపోయాడు. అక్కడ్నుంచి ఆడపిల్లల వెయిటింగ్ రూమ్ స్పష్టంగా కనబడుతుంది. అందులోనుంచి ఏ క్షణాన్నయినా ఇందాకటి తటిల్లత తొంగిచూడవచ్చు.

ఆ నిరీక్షణలో ప్రసాదరావు మనస్సు ఎన్ని రకాలుగా పరిభ్రమించిందో స్పష్టంగా చెప్పటం కష్టం. అతని పరిస్థితి—స్థూలంగా చెప్పాలంటే— మనస్థిమితం లేనివాడిలా ఉంది. అతను నిలబడాలని కోరుకోవటం లేదు. కాని కదల్లేకపోతున్నాడు. బలీయమయిన ఆకర్షణ అతన్ని లాగుతున్నది. అతను దానికి వశుడై



కలువ పళ్ళెములు

ఫోటో—వై. ఎస్. ప్రకాశరావు (మద్రాసు-10)

పోయాడు.

కొంతసేపటికి అతను ఆశించినట్లుగానే మాలతి బయటికి వచ్చింది. ఆమె వెంట రంగనాయకి కూడా ఉంది. ఇద్దరూ ప్రసాదరావు వంక చూశారు. పట్టించుకోనట్లు ముందుకు సాగారు.

ప్రసాదరావు ముఖం ఎర్రనయింది సిగ్గుతో. వెనక్కు తిరిగి సైకిల్ తాళం తియ్యబోతూండగా ఎవరిదో సున్నితమయిన హస్తం అతని భుజం మీద పడింది. అతను వెనక్కు తిరిగి ఆ వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. "అరె జయరాం! నువ్వా? ఇక్కడ పనిచేస్తున్నావా?" జయరాం నిట్టూర్చి "అంత అదృష్టమా భాయ్? బి.ఎస్‌సి. చదువుతున్నాను" అన్నాడు.

ప్రసాదరావు నవ్వి "నీకేంలే? పెట్టి పుట్టిన వాడివి. ఎన్ని దండయాత్ర లయినా చెయ్యగలవు" అన్నాడు.

"అలాగే ఉంటుంది నీకు?... అవునుగాని నువ్విలా దయచేశావేమిటి? కొంపదీసి అధ్యాపకుడివి కాలేదు గదా?"

"అంత ప్రమాదం ఏమీలేదుగాని, ఒక్క సంగతి అడుగుతాను చెబుతావా?"

"లక్ష అడుగు."

"ఇందాక ఇటు వెళ్ళింది చూశావా? ఎర్ర ఓణీ వేసుకున్న రెండు జడల అమ్మాయి. ఆ అమ్మాయి వివరాలు కావాలి."

"గుడ్ గాడ్!"

"ఏం?"

"ఆ అమ్మాయి పేరు మాలతిరా."

"ఏం అయితే?"

"మాలతిరా ఆ అమ్మాయి పేరు" అన్నాడు జయరాం తిరిగి విముగ్గా.

• • •

అంతకుమించి అక్షరం చెప్పలేదు జయరాం ప్రసాదరావుతో. అతనిలో ఆసక్తి ఇనుమడించింది. జయరాం పిరికివాడు కాదు. ఆడపిల్లల్ని ఏడిపించటంలో, వాళ్ల వివరాలు సేకరించటంలో అఖండుడు. వాడే భయపడ్డాడంటే ఇందులో పెద్ద రహస్యం ఉండటానికి ఆస్కారం ఉంది.

ఆ మర్నాటినుంచీ దాదాపు రెండు రోజులకోసారి ప్రసాదరావు కాలేజీకి రావటం సాగించాడు. మాలతి కనపడిన క్షణాన బిగుసుకు పోయినా మిగతా సమయాలలో ఆమె జీవిత విశేషాలు సేకరించటం సాగించాడు; సాధించాడు.

మాలతి తండ్రి శాస్త్రిగారు రిటైర్డు పి.డబ్ల్యు.డి. ఇంజనీరు. దుర్మార్గుడు. కూతురు పూర్తిగా ఆయన పోలికే. ఎంత అమాయకంగా కనబడుతుందో అంత రాక్షసి. పిచ్చి వేషాలు వేసిన ఒకరిద్దరు బడుద్ధాయిలకు దేహశుద్ధి చేసింది (లేక చేయించింది). ఏ కుర్రకుంకా ఆమె జోలికిపోడు.

చిత్ర మయిన పౌరుషం రేగింది ప్రసాదరావులో. అతనికి ఆమెలో పసితనం తప్ప మరేం కనపడలేదు. 'వేలెడు లేదు. ఇంత హడలగొట్టిందా వాళ్లను?' అనుకున్నాడు.

ప్రసాదరావు చేస్తూన్న ఈ వ్యవహారమంతా రంగనాయకి గమనిస్తూనే ఉంది. ఆమెకు అతని మీద కొంత జుగుప్స కలిగింది. 'పెద్దమనిషి తరహాకు తగని పనులు చేస్తున్నాడు.'

రంగనాయకికి ఒక అలవాటు ఉంది. ఆ అలవాటు ప్రసాదరావుకూ తెలుసు. ఆమె నాలిక బహు తేలిక. తొందరపాటు కావలసినంత అని పిస్తుంది. ప్రసాదరావును గురించి మాలతితో చిలవలు పలవలుగా చెప్పింది. మాలతి నమ్మి అతడిమీద ద్వేషభావం పెంచుకోసాగింది.

ఇంతలో ప్రసాదరావుకు అతను వేచిఉన్న శుభదినం రానేవచ్చింది. అతని కథ అచ్చయి అందంగా అతని ఇంటికి వచ్చింది. అతని ఆనందానికి అవధుల్లేవు. ఆయినవాళ్ళకూ, కాని వాళ్ళకూ అందరికీ చూపించాడు. కొందరు ఆకాశాని కెత్తారు; కొందరు చప్పరించారు.

ఆ హడావుడిలో అతను మాలతి సంగతి

మరిచిపోయాడు. ఉత్సాహం పెల్లుబికి రాగా మరో కథ వ్రాశాడు. రెండో కథలో పాత్ర చిత్రణ కొత్తరకంగా చేశాడు. అలాగని అతనికి తెలీదు. అది అచ్చయిన నాలుగయిదు రోజులకు మిత్రులూ, శ్రేయోభిలాషులూ అమాటఅన్నారు. అందులో పాత్రలు ఎవరి పద్ధతిన అవి ఆలోచించుకొంటాయి. రచయిత ఆలోచించిపెట్టడు.


# తరచుగా మూత్ర విసర్జన

చక్కెరతోగాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రం విసర్జించడం ప్రమాదకరమైన చిహ్నం. అది శరీర తత్వాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, రోజు రోజుకు రోగిని మృత్యు సమీపానికి తీసుకువస్తూంటుంది. ఆరంభంలో శారీరకంగా కానీ, మానసికంగాకానీ శ్రమపడడానికి అయిష్టత, నడుం నొప్పి, దృష్టి మాంద్యం, తొడలవద్ద తిమ్మిరి, సర్వసాధారణంగా బలహీనత మొదలైన లక్షణాలు కనబడుతూవుంటవి. ఈ లక్షణాలు గోచరించటంతోనే తగిన చికిత్స చేయకపోతే, ఉత్తరోత్తరా అమితదాహం, ఆకలి, నోరు, గొంతు ఎండుకపోవుట, దురద, కాళ్లలో సంకటం, బరువు తగ్గటం, శరీరమంతా పొక్కులు, కీళ్లవాతం, కళ్లపొర, టి. బి, కురుపులు, రాచపుండు, తదితర తీవ్రవ్యాధులకు గురికావలసి వస్తుంది. "వీనస్ చారం" బిళ్లలు వాడి వేలాది మంది శమనంపొంది మృత్యువాతపడకుండా తప్పించుకున్నారు. "వీనస్ చారం" బిళ్లలు ప్రాచీన యూనాని వైద్యసిద్ధాంతం ప్రకారం శాస్త్రీయంగా అరుదైన మూలికలతోను, వనస్పతుల సారములతోను, స్వాభావికమైన క్షారములతోను తయారుచేయబడ్డవి. ఈ చికిత్సమొదలుపెట్టిన రెండవ, లేదా మూడవ రోజునుంచే అమితదాహం మూత్రంలో చక్కెర తగ్గి, తరుచుగా మూత్రవిసర్జన చేయటం నిలిచిపోతుంది. కొద్దిరోజులలోనే మీకు పగానికి పైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ చారం" ఖర్చు తక్కువ. నిరపాయమయినది. తీసుకొనడం సులభం. ప్రత్యేక కఠినపథ్యాలుకానీ, ఉపవాసాలు చేయవలసిన అవసరంకానీ వుండవు. రోగులు పుష్టికోసంబలప్రవర్ధకమైనవివిధపదార్థములను భుజించవచ్చును. కోరినవారికి పూర్తివివరాలుకల సారస్వతం ఇంగ్లీషులో పంపబడును. 50 బిళ్లల ఖరీదు 6.75 న.పై. మాత్రమే. పోస్టేజి నిమిత్తము రూ. 1—6. న.పై. అదనము. (ఒకేసారి రెండు, అంతకు పైగా, సీసాలను తీసుకున్న పోస్టేజి వుచితం.) దొరకు చోటు :

**(Selling Agents):**
**Barrys Commercial Corporation**
**(A.H.W.)**
**27/A Dhurumtollah Street,**
**Calcutta-13.**


# నాగదంష్ట్ర

ఆ ఉప్పెన అలాగే సాగిపోయింది. ఏకధాటి అరడజను కథలను వ్రాశాడు, అన్ని పత్రికలకూ పంపించాడు. అన్నింట్లోనూ అచ్చయినాయి, పారితోషికాలు కురిశాయి.

అతనిలో ఆత్మవిశ్వాసం ద్విగుణీకృతం అయింది.

ఇంతలో ఒక ఆదివారం వచ్చింది. రచయితగా మారిన అతని మనసు ప్రశాంతతను ఆకాంక్షిస్తూంది. మెల్లగా నడిచి కాలేజీ పరిసరాల్లో ఉన్న కొండ దగ్గరికిపోయి కాస్త పైగా కూర్చున్నాడు.

ఎర్రటి సూర్యకాంతి, ఉన్నత భావుకుడి హృదయంలా ఆ కొండ. దూరాన వంపులు తిరుగుతూ ప్రవహించే కాలువ. స్వేచ్ఛగా విహరించే పక్షులు. పచ్చని బయళ్లు.

అతనిలో ఆవేశం కలగసాగింది. అది గేయమైంది. అప్రయత్నంగా సంగీతాన్ని సంతరించుకుంది. శారీరం వ్యాపించసాగింది — దీనంగా, మధురంగా, విషాదంగా, కమ్మగా.

పాట అయిపోయే సరికి ప్రసాదరావు సొమ్మసిలిపోయాడు. గుండెలు పగిలిపోతాయేమో అనిపించ సాగిం దతనికి. ఈ ఆనందం ఎలా భరించాలి? ఎందుక్కలుగుతుంది ఇట్లా?

వెలుతురు మసక అవుతూంది. అతను కళ్లు నులుముకుని చుట్టూ చూశాడు. ఇరవై గజాల అవతల ఒక బాలిక అటు తిరిగి కూచుని ఉంది. ఆమె ధరించిన ఓణీ, రెండు జడల వయ్యారం అతనిలో ఆనందాన్ని కుదిపాయి.

"మాలతీ" అన్నా డతను సూటిగా.

వ్యక్తి కదల్లేదు. సమాధానం మాత్రం వచ్చింది—"ఊఁ!" అని.

"ఇలారా."

"రాను."

"అటువేపు తేళ్లు ఎక్కువగా ఉంటాయి."

మాలతి భయంగా అతనివేపు తిరిగి ఒక్క క్షణం ఆలోచించి చేతిలోని కొబ్బరిచిప్పను రెండుసార్లు గాల్లోకి ఎగరవేసి పట్టుకొని "మీరే ఇలా రండి" అన్నది.

"పెద్దవాళ్లు చెప్పిన మాట వినాలి."

"మొగాళ్లంతా మొండివాళ్లే" అంటూ లేచివచ్చిం దామె. ఒక్కక్షణం అతనివంక చూచి ఫక్కున నవ్వింది.

"ఏమిటి నవ్వావు?"

ఆమె మాట్లాడలేదు. వేలిమీద పిచ్చిగీతలు గీయసాగింది.

అతనికి ఊహ తట్టింది. "ఏకవచనసంబోధనకు నవ్వుతున్నావా?"

ఆ ఊహ తట్టలేదే అనుకుంది మాలతి. పైకి "ఊఁ" అంది కుహనా కోపంతో.

"నాకు ఆడవాళ్లను—అందులో నాకన్నా చిన్నవాళ్లను మీరు అనే అలవాటు లేదు."

"ఎంత గర్వం?"

"కళాకారుణ్ణి గదూ?"

నిజమే అనిపించిం దామెకు. ఎంత బాగా పాడాడు ఇందాక పాట? అతని కథలు మాత్రం?

"నీకు చాలా గర్వం అని చెప్పారు?" అన్నా డతను తిరిగి,

"ఎవరు?"

"చాలామంది విద్యార్థులు. ఆ మాట కొస్తే కొందరు విద్యార్థినులు కూడా."

"అలాగా?"

"ఇద్దరు ముగ్గురు బుద్ధిమంతులకు దవడ బుద్ధి చేశావుటగా?"

ఆమె నవ్వాపుకుంది.

ప్రసాదరావు కొంటెనవ్వుతో "నన్నూ అలా చేస్తావేమోనని భయపడ్డాను" అన్నాడు.

"చెయ్యనని గ్యారంటీచేసుకున్నారాఇప్పుడు?"

"ఆఁ!"

"ఎలా?"

"ముక్కూ మొహం ఎరగని వాడితో ఇంత చనువుగా మాట్లాడుతూంది ఒక ఆడపిల్ల అంటే అర్థం ఆమెకు అతనంటే కోపంలేదని."

"అలాగని ఎక్కడన్నా రాసిఉందా?"

"నేనే రాస్తాను."

"గొప్ప. నాలుగు కథలు పడేసరికి."

"నలభై వందలు పడతాయి. ప్రసాదరావంటే మజాకానా?"

"అనుకుంటూాండండి అలాగే."

"పోనీగానీ, ఏమిటీ ఒంటరిగా ఇలా వచ్చావు?"

"ఆంజనేయస్వామి గుడికి."

"ఏం కోరుకున్నావు? పరీక్ష పాసవాలనా?"

"కాదు."

"మంచి మొగుడు రావాలనా?"

చిరుకోపంతో ఆమె ముఖం ఎర్రనయింది. పసిపిల్లలతో పండు ముసలిలా ఏమిటా మాట లతను?

"కోపం వచ్చిందా?"

ఆమె మాట్లాడలేదు.

"ముందే చెప్పానుగా మాలతీ! నిన్ను మన్నించాలనీ, పాడిగా, వరాయిగా మాట్లాడా లనిపించటం లేదు" అన్నాడు తను ఆర్ద్రంగా.

"ఎందుకనో?" అన్న దామె సన్నగా, సిగ్గుగా.

"నాకే తెలియదు. కొంపదీసి..."

ఆమె గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి. ఆ తరువాత ఏమంటాడు అతను? ఏం జరుగుతుంది?

"నువ్వంటే నాకు ఇష్టమేమో?"

నిరీక్షణలో ఉన్న బాధ అనుభవంలో ఉండదు. అతనా మాట అనివెయ్యగానే ఆమె బరువు తీరినట్లయింది. ఆ 'రిలీఫ్'తోపాటు సిగ్గు ముంచుకొచ్చింది. అది క్షణక్షణానికీ కోపంగా, అభిమానంగా, బాధగా రంగులు మార్చుకోసాగింది.

అతని పరిస్థితీ ఇంచుమించు అలాగే ఉంది. అనాలోచితంగా అతనికే తెలియని స్థితిలో అన్నాడా మాట. ఎంత చిన్నపిల్లైనా, ఆమె యందు తన కెంతటి వాత్సల్యభావం ఉన్నా అలా అనటం తప్పన్న విషయం అతనికి ఆ తరువాతి క్షణాన తట్టింది. కాని ఏం లాభం? నోరు జారాడు.

అందుకే ఇద్దరూ మౌనంగా కొన్ని యుగాల పాటు కూచున్నారు. ప్రసాదరావు మనసు ఆ సమయంలో పరివర్తన పొందింది. వాత్సల్యం స్థానాన్ని మరో అందమయిన అనుభూతి ఆక్రమించుకోసాగింది. ఆమెలో పసితనాన్ని గాక యౌవ్వనాన్ని, అందాన్ని ఆస్వాదించటం ప్రారంభమయింది.

చీకటి పడింది. దాన్ని చీల్చుకుంటూ తూర్పున చంద్రోదయం అయింది. యౌవనంలాంటి వెన్నెల. తొలి యౌవనపు అర్థంలేని ఆవేశం అందులో ఉంది. అర్థశూన్యమయిన దాంట్లో ఆనందం ఉంటుందని కాబోలు నిరూపిస్తోంది.

ప్రసాదరావు పెదివి కదిపాడు. అతని మాట గొంతులో ఉండగానే "పోతాను" అన్నది మాలతి.

"ఈ చీకట్లో ఒంటరిగానా? భయ మెయ్యదూ?"

"పసిపాపాయి ననుకున్నారా?"

'ఇదివరలో' అనుకున్నాడు ప్రసాదరావు.

"వెళ్లిరండయితే."

అతని బహువచన ప్రయోగానికి ఆశ్చర్యపోయింది మాలతి. "మీరు రారా?"

"ఒంటరిగా వెళ్లగలనన్నారుగా?"

ఆమె కదల్లేదు. తమాషాగా ఉందే ఈ మార్పు అనుకుంది. అతనిలో చిరునవ్వు, చిలిపితనం. స్థానే గంభీరత ఎందుకు వచ్చినట్లు?

"దూరంగా పోదామనుకుంటున్నారా?"

ఉలిక్కిపడ్డాడు ప్రసాదరావు. ఏమిటి ఆ ప్రశ్నకు అర్థం? "ఏ మలా?"

"లేకపోతే ఈ కొత్త పిలుపుకు అర్థం ఏమిటి?"

అంత సూటిగా అడిగేస్తుందామె అనుకోలేదతను. నవ్వుతెచ్చుకొని "అలా అనాలని అనిపించింది" అన్నాడు.

"ఎందుకనో?"

"ఊరికే అనిపించింది."

"ఉన్నట్లుండి నేనుపెద్దదాన్నైపోయానా?"

"ఊ!"

"రచయితలు పిచ్చివాళ్లు అన్న వాళ్లు తెలివయిన వాళ్లే."

"అంతే మరి." అతని గుండెల మీద మేఘాలు తొలగిపోయాయి. ముఖం నవ్వుతో వెలిగింది.

"పోదాం పదండి."

"దేవిగారి ఆజ్ఞ."

ఆ రాత్రి వాళ్లిద్దరూ నిశ్చింతగా నిద్ర పోయారనడం అవాస్తవికం. సాయంత్రం జరిగిన సంఘటన కలలా ఉంది వాళ్లకు. అలా జరుగుతుందా ఎక్కడయినా? అంతకుముందు ఒకరితో ఒకరు ఒక్క ముక్కయినా మాట్లాడుకుని ఎరగరుగదా?

మాలతికి తలుచుకున్నకొద్దీ ఆశ్చర్యం కలగసాగింది. అతనంటే తనకు నిన్నటిదాకా కోపం, అసహ్యం. అయితే అది నిజాయితీ ఉన్నది కాదన్న మాట. తాను అతన్ని ద్వేషించలేకపోయిందన్న మాట.

అయితే...

అవును. తను ఏమనుకుంటూందో తనకే తెలియదు. అర్థం కావటం లేదు ఆ అనుభూతి. ఎందుకు జరగా లట్లా? కథల్లో ఉండే కవిత్వం జీవితంలోకి ప్రవహించిందా? అంతే జరిగిఉండాలి. అయినా అదేం సంఘటన? అతని పాటకు అంతగా లొంగిపోయిందేమిటి తను? అందులో నిజంగా అంత గొప్పతనం ఉందా? అది రాగంలో ఉందా? సాహిత్యంలో ఉందా?

మాలతికి నవ్వొచ్చింది. ఎందులో ఉంటేనేం? అనుకోని విధంగా ఒక మహత్తరమయిన సంఘటన జరిగిపోయింది. జీవితంలో ఒక మధురమయిన సన్నివేశం ప్రారంభమయింది.

ప్రసాదరావుకు అలాగలేదు. అతను మరో రకంగా ఆలోచించాడు. ఆడపిల్లతో స్నేహం అంటే దానికి ఒక్కటే పర్యవసానం ఉంది ఈ పవిత్ర భారతదేశంలో. అది—ఆమెతో వివాహం. అందుకు తాను సమ్మతిస్తాడు. ఆ అమ్మాయి తల్లిదండ్రులో?

ఆ మథనతో అతనికి వారం రోజులపాటు నిద్ర పట్టలేదు. ఆదివారంనాడు తెగించి, ధైర్యమంతా కూడగట్టుకుని మాలతి ఇంటికి వెళ్లాడు. శాస్త్రిగారు గుమ్మంలోనే పడక కుర్చీలో పడుకుని పేపరు చదువుకుంటున్నాడు. ప్రసాదరావును చూడగానే "ఎవరికోసం?" అన్నాడు తీక్షణంగా.

"మీకోసమే."

"మీ పేరు?"

చెప్పాడు.

"ఏం చదువుతున్నా

చెప్పాడు.

ఆయన ధోరణి [illegible]ప్పు వచ్చింది. పక్కనున్న కుర్చీ చూపించ "కూచో" అన్నాడు.

ప్రసాదరావు కూర్చున్నాడు.

"ఏమిటి నాతో నీకు పని?"

ప్రసాదరావు తటపటాయించాడు.ఎలా చెప్పాలి ఈ సంగతి? ఆయన దుర్వాసుడు. ఏంచేస్తాడో? తన గురించి కాదు తన భయం. మాలతిని బాధిస్తే?

అతనలా ఆలోచనల్లో ఉండగానే మాలతి

> సాధారణంగా కుక్కలను ప్రేమించే వారిలో అధిక సంఖ్యాకులు స్త్రీలపట్ల క్రౌర్యం ప్రదర్శిస్తారు.

లోపల్నుంచి వచ్చి ఆశ్చర్యంగా "మీరా?" అంది. ప్రసాదరావు ఇబ్బందిగా నవ్వాడు.

"అతను నీకు తెలుసునా నాన్నా?" అన్నది మాలతి తిరిగి.

"ఇప్పు డిప్పుడే తెలుస్తూంది" అన్నాడాయన అతనివంకా, ఆమెవంకా పరిశీలనగా చూస్తూ.

"మొన్న నువ్వు తెగ మెచ్చుకున్నావే ఆ 'స్వయంకృతం' కథ రాసినాయన."

శాస్త్రిగారి ముఖం వికసించింది. పెదిమల చివర మధురజ్ఞాపకాల తాలూకు చిరునవ్వు మెరిసింది.

"అలాగా? చాలా బాగా రాశావోయ్. కాని చివరికి అదేమిటి ఆ సుందరిని చంపి ఊరుకున్నావ్?"

ప్రసాదరావు సిగ్గుపడి "అలాగే జరుగుతుందనిపించింది" అన్నాడు.

"నిజమే ననుకో. అయినా ఆమెను తిరిగి మామగారింటికి పంపిస్తే బాగుండేదేమో?"

"ఆమెపాత్ర దెబ్బతినదంటారా?"

"నిజమే" అన్నాడాయన ఒప్పుకుంటూ.

మాలతి వాళ్లిద్దరి సంభాషణ శ్రద్ధగా వింటూ, మధ్య మధ్య అతను ఎందుకు వచ్చాడా అని ఆలోచిస్తూ కూచుంది.

"ఇంకో సగంతోయ్? నువ్వు కథలు రాయటం కొన్నాళ్లు ఆపు. ఒక మంచి నవల రాయి."

"నాకూ రాయాలనే ఉంది. కాని అందుకు తగ్గ సరంజామా దొరక్క ఊరుకున్నాను."

"బాగా ఆలోచించు. స్వతస్సిద్ధంగా ఉండే పాత్రలతో రాయి. నేనూ నా చిన్నతనంలో కొన్ని కథలు రాశాను. పత్రికల ముఖం చూడలేదనుకో" అన్నాడాయన చిన్నపిల్లాడిలా.

"అనుకున్నాన్లెండి."

ఆయన కొరగా చూస్తూ "హాస్యమా?" అన్నాడు.

"అబ్బే" అన్నాడు ప్రసాదరావు నవ్వాపుకుంటూ.

ఆ తరువాత దేశీయ, విదేశీయ సాహిత్య స్థితుల్ని గురించి అనర్గళంగా అరగంట ఉపన్యసించాడు శాస్త్రిగారు. ఉప్పొంగే ప్రేమతో "తరుచూ వస్తూండు" అని చెప్పి సాగనంపాడు.

ప్రసాదరావు నిట్టూర్చాడు.

(సశేషం)